
సీయస్సీ. మురళి


# దేముడి నోటీసు



అమ్మలారా, అయ్యలారా? ప్రపంచ మానవులారా? మనిషయ్య గారి మనసయ్య గారి పుత్రుణ్ణైన నేను యావద్యూనివర్సును నిశితముగా పరీక్షించి, అన్ని విషయములను క్షుణ్ణముగా గ్రహించి, ధర్మము, న్యాయము, నీతి, నియమము దృష్టిలో నిల్పుకుని, నా స్వంత నిర్ణయముగా, నిండు ఆరోగ్యము గలవాడనై, పరిపూర్ణమైన స్పృహ గలవాడనై, మెలకువలో నా స్వబుద్ధిన నా స్వంత దస్తూరిలో వ్రాసి విడుదల చేసిన ప్రకటన ఇది.

మీ కందరికీ తెలియగలందులకుగాను ఈ ప్రకటనను నేను తెలుగనంబడు భాష యందున వ్రాయడము జరుగుతున్నది. కావున ఇక యావత్ప్రపంచము కూడా ఈ భాషను దేవత భాషగను, ఈశ్వర దత్తముగను, మిగిలిన వాటిలో మూడు వేల మూడు వందల నలభై నాలుగున్నన భాషలను మానవ భాషలుగను, వాటిలో ఇమడక వేరొండుగా ఎదిగిపోయినట్టు యాంగ్ల భాషను మాత్రము దేవతలకు కూడా సాధ్యము గాని సర్వాంతర్యామి భాషను పరిగణించవలసినదని నా యభీష్టము.

మనుష్యులలో గత రెండు వందల సంవత్సరములుగా, ముఖ్యముగా గత నూరేండ్లుగా, అందునను అధిక ముఖ్యముగా గత ఏబది సంవత్సరములుగా అనేక రకములైన అపప్రథలు, తప్పుడు నమ్మకములు, దురాశలు, దుష్ట జ్ఞానము ప్రబలిన విషయము నాకు మిక్కిలి నమ్మకస్థులయిన కాకేసి యను జాతి మనుష్యులు తెలుపుట జరుగుతున్నది. ఈ దుష్పరిణామములను, తప్పుడు పరిజ్ఞానమును పటాపంచలు చేయంగల్గునట్లుగా, యీ నోటీసును నేను వ్రాసినట్లుగా మనుష్య లందరూ





విరుంగునది - మనిషికి తల, కాలు వంటివి సృష్టికి ఎక్కువ తక్కువలు. మర్రి చెట్టు ఎత్తైనది, బలమైనది. బీరపాదు ఎత్తెదుగలేనిది, బలహీనమైనది. తాటి చెట్టు తాడిలాగా పొడుగైనది. ఈత చెట్టు పీతలాగా నేల నంటుకొని పొట్టిగా ఉండునది. ఈ విషయము సర్వ విదితము. అయిననూ **పునరుద్ఘాటితము.**

ఒకానొక కాలమున ఆర్యులు కుల వ్యవస్థను గురించి తికమకలు, తిరకాసులు విడిచి ముత్యము వంటి మాట యొకటి పురుష సూక్త మనుచోట చెప్పి యుండుట నా దృష్టికి వచ్చినది. ఆ రీత్యా హైందవ సంఘము నాలుగు వర్ణములుగా విభజింపబడినది. మూల పురుషుని తల నుంచి బ్రాహ్మణు లనువారును, బాహువుల నుంచి క్షత్రియులును, కడుపు నుండి వైశ్యులును, కాళ్ళ నుండి శూద్రులును పుట్టినందున ఆ యా అంగముల గుణ గణమ్ముల బట్టి ఈ నాలుగు వర్ణముల వారును సంఘమున క్రియ కర్మాదులను నెరవేర్చవలసినదని తాత్పర్యము.

ఈ రీతి రివాజులను నేను ప్రపంచ దేశములకు కూడా వర్తింప చేసినట్లుగా తేటతెల్లము.

అట్టిదెట్టిదనగా, సర్వాంతర్యామి శిరము నుండి యుత్తర అమెరికా, యూరపు, ఆస్ట్రేలియా ఖండముల యందుండుకున్న దేశములు పుట్టినట్లును, వా రీమధ్య జపాను అను ఆశియా దేశమును దత్తత చేసికున్నట్లును, కొరియా, సింగపూరు, హాంకాంగ్ అను వాటిని కృత్రిమ సంధానము అనగా ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్ ద్వారా సంతుగా పొందినట్లున్నూ ఆయన బాహువుల నుంచి కొన్ని దక్షిణ అమెరికా దేశములు అనగా మెక్సికో, బ్రెజిలు, అర్జెంటీనా, చమురు బావులు బాగా ఉండుకొన్న మధ్య ప్రాక్కు దేశాదులు పుట్టినట్లున్నూ ఉదరము నుండి ఇండియా పాకిస్తాను, ఈజిప్టు, ఇరాన్, చైనా ఆదిగా గల దేశము లుద్భవించినట్లున్నూ పాదముల నుండి దక్షిణాఫ్రికాలో గల శ్వేత జాతుల వారు దొరక బుచ్చుకున్న స్థిర, చర సంపదలను మినహాయించి మిగిలిన దేశములన్నియు ఉద్భవించినట్లున్నూ ఎల్ల రెరుగునది. ఈ దేశములన్నియూ ఆ యా యంగముల నుండి పుట్టినప్పటికిన్నీ అందందు కొందరు నీచ ప్రజలు మాత్రము సర్వాంతర్యామి పాద ధూళి నుండియు, చెమట నుండియు, ఇతర విసర్జనముల నుండియు వృ[illegible] చెల్లా చెదరైనందున వారందరును "విశ్వ హరిజను" లను తరగతికి చెందిన వారుగా ఇందువల్ల ప్రకటించబడుచున్నది. వారి ధర్మముల గురించి "దేశములు - ధర్మములు" అను షెడ్యూలులో చర్చించబడును.

దేశోత్పత్తి క్రమము ఈ విధముగా జరిగినప్పుడే మనిషి జాతి కూడా నాలుగైదు తరగతులుగా చీలి యుండుట ఎరుగ వలసినది. ఈ క్రమము ప్రకారము తెల్లని దేహ ఛ్ఛాయ కలవారును, కొనదేరిన ముక్కులు గల వారును, వల్చటి రంగు గల జుట్టు గలవారును, దేహములందు మరీ ఎక్కుడు జుట్టు లేని వారును అయినట్టి కాకేసి యనులు - వీరిలో కొంత వర్ణ సంకరము జరిగి రంగు విరుగుట, ముక్కు కొనలు తరుగుట, జుట్టు రంగు మారుట, ఇతర శారీరక పరివర్తనములు కలుగుట జరిగినప్పటికిన్నీ ఆల్పైనులని, లావులని, తూర్పు బాల్టికులని, నార్డికులని ఎన్నెన్ని పేర్ల పిలవబడుచున్ననూ - వీరందరూ దివ్య పురుషుని శిరస్సు నుంచి పుట్టిన వారలై - ఆర్యులని, బ్రాహ్మణులని, యూదులని పేర్లెన్ని పెట్టుకున్ననూ, అన్నిచోట్లను సమాజమునందు అగ్ర స్థానము గలవారయి మెలగుట మా అభిమతముగా జరిగినది. దేహచ్ఛాయతో నిమిత్తము పెట్టుకొనక మరి కొందరు బాహువుల నుండి పుట్టుటకు నిర్ణయించుకుని - ఖడ్గ బలము చేతను, కాఠిన్యము చేతను, బలహీనులయిన వారిని చంపి వీరులగుట చేతను వీరందరూ మనిషి జాతి వీపున సవారీ చేయగలవారని నిర్ణయము జరిగినది. వీరలు క్షత్రియులనియు, రాజులనియు, నియంతలనియు, ప్రధానులనియు, ప్రెసిడెంట్లనియు, మంత్రులనియు, ఏ పేరున ఎరగబడినను అన్నిచోట్లను పాలకులయి మెలగుటయు మా అభిమతమే. ఒకోమారు రంగు పెక్కుడయ్యున్నూ ఒకోమారు రంగు తక్కుడయ్యున్నూ ఉన్నప్పటికీ



డబ్బు మార్పిడి, సరుకు మార్పిడీ బాగా ఎరుగుకుని, జలగలు రక్తము పిండినట్లు మనుషుల రక్త మాంసములు పిండుట ఎరిగికొన్నవారలగుట వలననూ ఈ పిండిన రక్తమును, ఎండిన మాంసమును కూడా డబ్బుగా మార్చగలిగి యుండుట వల్లనూ వ్యాపార ధర్మ మెరిగినవారలని వైశ్యులను, శ్రేడర్లను, కాపిటలిస్టులను పుట్టించుట ఈశ్వరుని ఉదరము నుండి జరిగినది. ఈపాటికే మీరందరునూ గ్రహించినట్లే పరమాత్ముని పాదముల నుండి రంగు ఎరుగని నల్ల వారిని, యుద్ధములందు స్థానచ్యుతులయిన వారందరినీన్నీ బరువుతో కూడిన పనులు చేయించుటకు నియమించి శూద్రులని నిర్ణయించి పుట్టించుట జరిగినది.

ఆ యా దేశములను, ఆ యా జాతులను ఆ యా విధములుగా పుట్టించి - అచ్చటచ్చట దేశ కాల పరిస్థితుల కనుగుణముగ కొంత పాటి మార్పులు - చేర్పులు చేసికొనుటకవకాశమిచ్చిన మేము విశ్రాంతి తీస్కొనగలమని యాశించి, అనేక ప్లానులు వేసుకొన్నాము. కాని ఎక్కడి విశ్రాంతి? విభజనలో ఎక్కడ లోటు జరిగినదో ఏదో, మనుషులలో కొందరికి ఈ రకమైన విభేదములు ధర్మము కాదని తోచినదట. వారు ధర్మమేది? అధర్మమేది? అను ప్రశ్నలతో రభస చేయుచున్న వైనము మావరకొచ్చిన కారణమున, మే మిదివరలో - అనేక మత గ్రంథములలో ధర్మము, నీతి, ఏ దెట్టిదన్న నిర్వచనములను ఇచ్చిన వారమే అయినను మరొక్క మారు - మరింత సూటిగను, సులభముగను చెప్పుటకు నిర్ణయము.

బలవంతుడు బలహీనులను అణగదొక్కుట సృష్టి ధర్మము. అదే మానవ ధర్మముగా ఎరుగవలసినది. దీనిని మించిన ధర్మము మరొకటి లేదని దీని భావము.

ఈ ధర్మముననుసరించియే అమెరికా, రష్యా, ఫ్రాన్సు, ఇంగ్లాండు, జర్మనీ వంటి దేశములు ఐక్యరాజ్య సమితి యను కూటమిలో సర్వకాల సభ్యులై మిగిలిన దేశములన్నిటిపైన జీవన్మరణ వీటో కలిగిన వారుగా ఇందువలన చెప్పడం. ఇటువంటి ధర్మమే మనిషి జీవితమున అడుగడుగునా తగలడం జరుగును.

దీని విషయమున సందేహము అనవసరము. ప్రశ్నలు పాడి కాదు.

ఈ ధర్మమును బట్టియే స్త్రీలు పురుషులకు దాసులు. ఆస్తి బలము గల వారికి ఆస్తి బలము లేని వారు దాసులు. సేవకులు ప్రభువులకు, యజమానులకు దాసులు. ఇంటి యజమానులు

## కంటిముత్యం

వేదన పులుముకున్న కంటి ముత్యమా!
కనురెప్పల చిప్పలు దాటి రాకు బయటికి!

పొరపాటున దొర్లి జారావంటే
నీ అణు వణువులోని అగ్నికణాల్లోని

ఆవేదన లావాలా విరజిమ్మితే
విశ్వాన్నే ముంచెత్తుతుంది
సమస్తాన్నీ దహిస్తుంది.

- చిల్లర భవానీదేవి

అద్దెల కుండు వారిపైన ఎక్కువ వారలు. పోలీసు వాడు ప్రజలందరిపైనను దెబ్బతీయగల అబ్బగాడు. ఈ బల మనునది అనేక రూపములలో ప్రత్యక్ష మగుట మాకు సమ్మతము.

అది పురుషుని మర్మాంగముగను [ఇది తెలియుట వల్లనే హిందువులు లింగ రూపములో నన్ను పూజింతురు], సైనికుని ఖడ్గముగను, సిపాయి తుపాకిగను, డబ్బు గలవాడి ప్రహరీ గోడగను, కుక్కగను, సేవకునిగను, కారుగను, రేడియో కేంద్రముగను, దిన పత్రికగను, తలపాగగను, కండువాగను, కాషాయముగను, వాడి నిమిత్తమై, వాడిచేత సృష్టించబడిన దేశముల యొక్క రాజ్యాంగముగను, చట్టములుగను, మిలట్రీ, పోలీసు, బోర్డరు సెక్యూరిటీ ఫోర్సు, కష్టమ్స్ - ఇట్లు పలు రూపములుగా నుండుట మా కెంతయో సంతోషము.

మనిషి తన సహజ స్థితియైన అరణ్య జీవితము వదిలి, నాగరికతయను అసహజమైన స్థితిలోకి దిగజారుట జరిగినప్పటికిన్నీ సృష్టి ధర్మము, పశు నైజము ఆయినట్టి పరస్పర పీడనము మరిచిపోకుండగ, దానికి వచ్చె తెచ్చునట్లు స్వజాతి పీడనము కూడా అలవరచుకుని సృష్టి ధర్మమునే మెరుగుపరుచుట మా కెంతయో చక్కిలిగింతలు పెట్టెడి విషయము. అందువలననే భూమి మీద పడిన ప్రతి ప్రాణి భూమి మీద బ్రతికేందుకు ఒకే

హక్కు కోరుతున్నప్పటికినీ, ఆ బ్రతకడానికి అవసరమైనట్టి భూ వనరుల మీద కొందరు బలవంతులు మాత్రము హక్కు ప్రకటించుకుని - ఆ హక్కును ప్రాథమిక హక్కుగా రాజ్యాంగముల యందును, శాస్త్రముల యందును, మత గ్రంథముల యందును, నీతి కథల యందును, పుక్కిటి పురాణముల యందును వ్రాసుకుని, అవన్నియు మా నోటి నుండి ఊడి వారి చేతులలో పడినట్లుగా చెప్పుకొనుచు, ఆ హక్కును పరిరక్షించుటకై, పోలీసాది పీడన భటులను ప్రజలందరి శ్రమ వలన తయారైన ధనకనకవస్త్రాదుల చేత పోషించుటయు బలవంతులయిన వారి జాణతనమని మే మంగీకరించితిమి. అందుకనే భారతమున జరిగిన ఆస్తి పోట్లాటలను ధర్మా ధర్మముల మధ్య జరిగిన సంఘర్షణగా ప్రచారము చేయుటకు మా నిశానీ నొసంగితిమి.


అసలు జరిగినదేమి? జరిగిన దాని ఫలితమేమి?

ధర్మ రాజనే మనిషి, జూదమాడుట ఎట్లను విషయ మెరుగకపోయినను, ఆటఉపక్రమించి, అందు రాజ్యమునే కాక, తోబుట్టువులను, వారికిని తనకూ కలిపి పెండ్లి చేసిన యాడు దానిని కూడా పణము పెట్టి, అన్నిటినీ తిరుక్షవరము చేసి, ఆనక ఆ యాడ మనిషి ఎట్లో తన పెద మామ గారిని పొగిడి, ఉబ్బించి, తిరిగి సంపాదించిన రాజ్యమును మరల చేతకాని ఆట ఆడి మరొక మారు చేజార్చుకుని, తనతో పాటుగా ఆ ఆడుదానిని, ఆపై మిగిలిన నలుగురు మగేండ్లనూ అడవుల పట్టించినాడు. ఆట ఓడుటయే గాక, ఆడినది మాయాజూదమని వ్యాసుడి కాళ్ళు పట్టుకుని ఆయన చేత వ్రాయించుకున్నాడు. మాయాజూదమని తెలిసిన వాడు ఆడుట ఎందుకని ఎవరైనా అడిగి పోదురనుకున్నాడో ఏమో, అదని రాజనూయ ధర్మ మనునట్లుగా వ్యాఖ్యానములు చేయించుకొన్నాడు.

ఆడినది తాను! పోగొట్టినది తాను! అడవుల పాలయినది ఆ ఆడది. తను పోగొట్టిన ఆస్తి తిరిగి సంపాదించుటకు యుద్ధము జరిపించినాడు. ఎందరో ఆడ కూతుండ్లను బాల వితంతువులను చేసినాడు. అంతయు జరిగిన పిదప చేయించినది తాను కాదని, చేసినది చనిపోయిన వారు కాదని, జరిగినదంతయు జరిగినట్లగుపించెడిదే గాని నిజముగా జరుగలేదని కృష్ణుడను వానిచేత చెప్పించినాడు.

ఈ మాటలు చెప్పిన తీరును బట్టి, ధర్మరాజనువాడిని మేము గర్హించుతున్నామని ఎవ్వరూ అనుకొనరాదని మా ఆదేశము. ఎందుకనగా అతడు తనకున్న అధికార బలమును వినియోగించి, ఆ బలము లేని వారందరి చేత తాను మనసుపడినట్లు జరిపించుకున్నాడు. అది సృష్టి ధర్మమని మరొకసారి నుడువబడుచున్నది. అందుకే అతనిని ధర్మరాజన్నాడు వ్యాసుడు. ఈ ధర్మము యీ నాటికీ చెక్కు చెదరక వాడుకలో వుందని మేమందుము. ఉండగలదని కూడా చెప్పుదుము?

ఆ ధర్మము ననుసరించియే డబ్బు గల వాడు అది లేని వానిచేత పనులు చేయించి వానికి చావక బ్రతకక జీవించే పాటి పరిస్థితి కల్పించుట. ఆ ధర్మమును బట్టియే మనిషికి



ఇండ్లమీద, పొలము మీద హక్కు. అందుకే దానిని ప్రాథమిక హక్కుగా ప్రకటించుట. అటువంటి హక్కు అందరికీ కలదని ప్రచారము చేయుట!

హక్కుండును గాక, కాని అందరి హక్కు నిజం కాదగినంత భూమి, పుట్ర ఏదని ప్రశ్నించుట కొందరు తెలివైన వారికి గల మూర్ఖమైన సరదా? ఆస్తి హక్కు ప్రాథమికమైన హక్కు కారాదని వారి యోచన కావచ్చును? ముప్పాతిక మువ్వీసము ప్రజలకు వారి వంటి మీద మొలచు వెంట్రుకలను మించి వేరే ఆస్తియేలేని ఈ ప్రపంచమున బహు కొద్ది మంది మాత్రమే దొరకపుచ్చుకున్న హక్కు ప్రాథమిక హక్కు ఎట్లాయెను అన్నది వారి హేతు పూర్వకమైన కృశ్చను కావచ్చును.

ఆస్తి హక్కు ప్రాథమిక మైనంత కాలము ఉన్న వారు తమకున్న దానిని ఉంచుకొనుటకు, పెంచుకొనుటకు లేనివాడి శరీర శ్రమను, ప్రాణ హక్కును కూడా దొంగిలించి దోపిడీ చేయక తప్పదన్నది వారి వాదన కావచ్చును.

వారికి యిదే మా సమాధానము -

ఒక్క మాటలో చెప్పబడుచున్నది, తెలిసికొనుడు.


తెలివి గల మూర్ఖులారా! ప్రాణ హక్కు కన్నా
ఆస్తి హక్కే ఎక్కువ! ప్రపంచమున పుట్టిన
మనుష్యులందరూ సమానమని, అందరికీ
సమాన హక్కులున్నవని అనుట
మా సమ్మతముతో జరిగినది కాదు.
అది సృష్టి ధర్మమునకు విరుద్ధము.

ఎవరో కొందరు దూరము చూపు లోపించినవారు, అటువంటి హక్కులు సర్వ సమానములని ఒకానొక కాలమున ఏదో దుష్ట శక్తులకు, మతిభ్రమణకు, దురాశకు లోనై నిద్రావస్థలో పలవరించి, ఎవరికో లంచము లిచ్చి - పుస్తకముల యందు వ్రాయించుట జరిగినంత మాత్రమున సృష్టి ధర్మము వీగుట జరగదని యిందు ప్రకటితము.

కానీ ఈ సమాన హక్కులను భ్రమ ఒక జాడ్యమై ప్రపంచ దేశము లెన్నింటినో ప్రజల మనస్సులను ఆకట్టుకున్నందున ఆ యా దేశముల యందలి పాలకులు, శ్రీమంతులు, బలవంతులు ఆ హక్కు లున్నట్లుగనే నటించవలెనని నిర్ణయించుకున్నట్టుగా గ్రాహ్యము.

అటువంటి నాటకములలో ఓట్ల పండగ యనునది ప్రధానమని గ్రహించవలెను. ఈ రోజులలో ఈ హక్కు ఇంచుమించు అన్ని దేశములలోను లభించును. ఎన్నికలను ఒక పేరంటము లేక వీథి నాటకము జరుగును. ఆ పండుగ నాడు ఒకే వర్గమునకు చెందిన పాలకులు రెండు జట్లుగా విడిపోయి, ప్రజల ముందుకు వచ్చి, మీసములు దువ్వి, తొడలు చరుచుకుని, పెద్ద పెద్ద సమాసములతో తాము వ్రాయించుకున్న ఉపన్యాసములను ప్రజల ముందు అప్పజెప్పి ఛాయా యుద్ధము చేసి తాము గెలిచినందువలన బలహీనులకు మేలు జరిగి లోక కళ్యాణము జరుగునని తెలియజేసి పవిత్రమైన ఓటు తమకే యిమ్మని నిమ్మళించెదరు. ఆ తరువాత బలవంతుల మోజేతి నీళ్ళు తాగక తప్పని కొంత మంది మనుషులు డబ్బాల్లు తెచ్చి వాటిలో బలహీనుల వేలి ముద్రలు వేసిన చీటీలు వేయించుకుని వెళ్ళుదురు. తరువాత లెక్కలుపెట్టడము నేర్చుకున్న కొందరు ఆ ఎన్నికలలో శ్రీ బలవంతుడుగారు గెలిచిరో, శ్రీమాన్ బలవంతుల వారు గెలిచిరో - అనగా గెలిచినది ట్వీడిల్‌డమ్‌గారా, ట్వీడిల్‌డీగారా అన్న విషయము ప్రకటింతురు. ఆ పైన గెలిచిన డమ్ - డీగారలు కొన్ని సంవత్సరములు బలహీనుల సహకారంతో బలవంతుల కొరకు పరిపాలన సాగింతురు.

కాపిటలిస్టు సంబంధములు బాగా దృఢముగా - ఉధృతముగా ఎదిగిన కొన్ని దేశములలో, ఆ యా దేశములకు ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ సిబ్బందిని అమరించి ఆయత్తము చేసి అనేక వనరులను దోచగలిగినంత బలమున్నందునను, అందందున ఈ ఛాయా స్వాతంత్ర్యము వలన ముప్పు ఎక్కువ లేకపోవుట వల్లను, ప్రజల వేళ్ళతోనే ప్రజల కండ్లు పొడుచు క్రీడలో కొంత ఉల్లాసమున్నందువల్లను ఆ యా దేశములలో ఆ యా పద్ధతులుండుట పాడి యని నే నొప్పుకుందును. అయితే పులిని చూసి నక్క వాతలు పెట్టుకొనుట అంద రెరిగినదే. అలాగనే అంత సత్తువ లేని దేశములలో కూడా ఆ యా నాటకములను ఆడించుట. అవి నాటకములని





అర్థము చేసికొనని మూర్ఖులు కొందరు దీని వలన ప్రజలకు ప్రయోజనము జరుగలేదనుటయు, అల్లకల్లోలము సృష్టించుటయు, ఆఖరికి ఆ మంటలు ప్రథమ వర్గపు దేశముల పైకి పాకి ప్రపంచమంతయు అంటుకుపోయెడి ప్రమాద ముండుటయు మాకు చిరాకు కలిగించుచున్నదని ఇందుద్వారా ప్రకటితము. ఆ అపోహలను తొలగించుటకే మేమింతగా యీ విషయము ప్రస్తావించుట జరిగినది. దీని వలన అర్థము చేసుకొనవలసినదేమనగా ఈ సమ ధర్మము అనునది అనాగరికము మాత్రమే కాక అసహజము, ధర్మ విరుద్ధము - మా కసమ్మతము.

మే మీ విధముగా ప్రజలందరికీ తెలియజేశాము కనక ఇక దేశ నాయకులందరూబహిరంగముగానే ఈ ఓటు హక్కులు - చాటు స్వాతంత్ర్యములు ఉపసంహరించుకుని అన్ని సమాజములు బలవంతుల కొరకు మాత్రమే సృష్టించబడి నడుపబడుచున్నవని ప్రకటించుకొనవచ్చునని మా ఆనతి! అందువలన ఈ నాటకముల కొరకు జరుగు ఖర్చు కలసి వచ్చునన్నది వారెరుగనిది కాదు. ఈ సందర్భములో ఇటువంటి నాటకము లేవియూ జరుపకుండగనే దివ్యముగ పరిపాలనము చేయుచున్న నియంతలు, షేకులు ఎందరో వున్న సంగతి, వారితో ప్రథమ వర్గపు దేశముల కెంతయో సత్సంబంధములున్న సంగతి కూడా గమనార్హమని ప్రకటితము.

మరొక్క విషయము సూక్ష్మముగా ప్రస్తావించి యీ అంశము ముగించుటకు నిర్ణయము. అతి బలహీనులయ్యుండియు అత్యధిక సంఖ్యలో ఉండుకున్న వారి కొరకు కొన్ని దేశములలో రిజర్వేషను అని ఒక పద్ధతి ఉండుకొన్నది. ఈ పద్ధతి వలన తెలివితేటలు, మెరికతనము గలవారలు అధికారములోనికి రారనియు, అందువలన సమాజ మనునది బ్రేకులు పడి పురోగమనము చెందుట మానివేయుననియు కొందరు గుండెలు బాదుకొనుచుండుట మా వరకొచ్చినది. సమాజము ముందు కెళ్ళుట - వెనుక బడుట అను మాటలకే నిజముగా అర్థము లేదని నేను సహేతుకముగా నిరూపించగలను గాని, అది మరొకసారి - మరొకచోట. ఇప్పుడు చెప్పంబడునదేమన - అది ఈ రిజర్వేషను పద్ధతి కూడా ఓటు పద్ధతి వలెనే ఒక చాటుతనము గల పద్ధతి యున్నది. బలవంతులు తను చుట్టూ కట్టుకున్న ప్రహరీ గోడలో యిది కూడా ఒక ఇటుక వరుసగా తెలియునది. లెక్కకు మించినంత మంది బలహీనులలో ఒక రెండు పుంజీలను రిజర్వేషను గాలము వేసి పైకి లాగుటలో ఉన్న దొకటే ప్రయోజనము.

అది లాటరీ పెట్టి ఒకరిద్దరిని లక్షాధికారులను చేయుట యట్టిదే. ఆ పద్ధతి లేకపోయినచో దరిద్రులకసలే ఆశ నశించి, ఆపోహలు తొలగి, ఈ గాలము అందుకొని బయటపడిన చురుకుతనము గల వర్తమాన దరిద్రులు, భూత కాల దరిద్రులు - తిరుగుబాటు నాయకులై మొత్తము సృష్టి ధర్మమునకే చిచ్చు పెట్టి బలవంతులపై దండ యాత్రలు నడుపుదురని వారి యుద్దేశము కావచ్చును. కాని, మనము ముందు తెల్పినట్లుగా ఈ ప్రజాస్వామ్యము - సమస్వామ్యము మొదలుగా గల అసహజ వ్యవస్థలను, శుష్క స్వప్నములను, బహిరంగముగానే తోసిపుచ్చిన నాడున్నూ



ఇ. భాస్కర్ [హైదరాబాదు]

బలహీనులను బలవంతుల సేయగల వారమను అవప్రథ తొలిగిపోయిన నాడున్నూ, ఇటువంటి చాటుతనములు - మునుగు పద్ధతులు అవసరము లేదని మా నిర్ణయముగా తెలియునది. మరి ఆ విధముగా చేసిన నాడు తిరుగుబాటు జరుగదా యన్నది కొందరి సవాలు. సృష్టి ధర్మమును నే నింత విపులముగా ప్రకటించిన కారణము చేత అటువంటి ప్రమాద ముండరాదని నా ఆదేశము. దీనిని పెడ చెవిని పెట్టి యొకవేళ అట్టి సాహసము చేయ కొందరు పూనుకొని రనుకొండు. అప్పుడు బలవంతులు తమ అస్త్రములన్నియు వారిపై ఇప్పటికన్నా తీవ్రముగా ప్రయోగించుటకు ఇదే మా అనుమతి. అమెరికా, రష్యా, ఫ్రాన్సు, జర్మనీ దేశముల యందును, సూర్యుడస్తమించని బ్రిటిష దేశమందును కూడా ఎంత చక్కని మారణాస్త్రములు చేసిరని? వీని ముందు బ్రహ్మాస్త్రమును, పాశుపతాస్త్రమును, ఇంద్రుని వజ్రాయుధమును ఏపాటిది?

చదువరులలో ఎట్టి సందేహపు తునక మిగుల కూడదను దృష్టితో మరికొంత విస్తరించ నిర్ణయము. కావున బలవంతులనగా ఎవరు? వారు ఎట్లుందురు? వారి హక్కు లెట్టివి? అను విషయములపై మా ప్రవచనము లిట్లుండును.

అన్ని బలముల కంటెను ఆస్తి బలము, అందునా భూమి హక్కు మిన్నయని ఇందు ప్రకటితము. దానితో కూడినదే' ధన బలము. పిదప విద్యా బలము. పిదప కండ బలము, ఆనక వీటన్నిటి వలన పుట్టెడి అహంకార బలము లేక మద బలము. వీటి వలన దొరక బుచ్చుకొనునదే అధికార బలము. ఈ బలములు కలవారు ఈ ప్రపంచమున జీవించుటకు ఎక్కువ హక్కు గలవారని తాత్పర్యము. ఈ బలములు కాస్తో కూస్తో ఉన్న చాలదు. అతి మిక్కిలిగా ఉండవలెనని తాత్పర్యము.

ఈ టీక ప్రకారము కూడా తొలుత ఒకమారు చెప్పినట్లుగా ప్రపంచ దేశములందు అమెరికా, రష్యా, ఫ్రాన్సు, జర్మనీ, ఇంగ్లాండు - అనగా తెల్ల వర్ణముల వారుండు దేశములదే ఏల ఆధిపత్యమని మేము నిర్ణయించితిమో విశదము. యాదద్భూగోళమును, రోదసిని కూడా వీరికి ధారాదత్తము చేసితిమని ఇందువలన ప్రకటితము. ఈ హక్కును సుస్థిరము చేసుకొనుటకు వీరికి భూగోళమును బ్రద్దలు చేసి, సముద్రములను విష పూరితము చేసి, గాలిని నిరాశ్రయము చేసి, సర్వ జీవ రాశిని నాశనము చేయుటకు, అందుకు కావలసిన అస్త్ర సంపత్తిని సంపాదించుటకు మా అంగీకార మిందు తెలిపితిమి. అనగా వీరికి గల్ఫ్ దేశములందు గల చమురు బావులపైనను, సప్త సముద్రములందుండు నీటిపైనను, హిమాలయములందుండు మంచుపైనను, బెజవాడ యందుండు కాలువపైనను ఒకే రకపు హక్కుండునని వేరు చెప్పనక్కరలేదు. వారి హక్కును అందరి చేత గుర్తింప చేయుటకు వీరికి సామదాన భేద దండములు ప్రయోగించు అధికారము కలదని దీనివలన సుస్పష్టము. ప్రపంచమున మిగిలిన దేశము లన్నియు వీరి చెప్పుచేతలందు జీవించక తప్పదని ఎరుగవలసినది. దేశముల మధ్యా వలెనే దేశములందు కూడా చరిత్ర గతిలో దాడి చేయుచూ వచ్చిన శ్వేత జాతుల సంతతి వారలే అధికులని ఎరుగ వలయును. ఈ సందర్భములో బలహీనుల నుద్దేశించి మేమొక విషయము తేటతెల్లము చేయ నిశ్చయము.

ఎందరో అనామకులు ఈతిబాధలకు లోనై మా ముందు బారులు తీరి, వారి చెమటలోను, కన్నీటిలోను, నెత్తురు చుక్కలలోనూ తడిసిన పుష్ప ఫల పత్రాదులతో నిలిచి - "భగవంతుడా! ఆపద మొక్కులవాడా! మమ్మాదుకో" మ్మని మాకు తాఖీదులు పంపుకొనుట మే మెరుగుదుము. మమ్ములను గురించియు, మాకు వారంపిన తాఖీదులను మే మలక్ష్యము చేయుట గురించియు ఒక కవి గారు ఎంతో వెటకారముగా మేమొక చేతకాని వారమనీ - ఉత్త చేటపెయ్యమనీ ఒక కవిత వ్రాసి టాం టాం చేసిన విషయము మాకు కష్టము కలిగించిన మాట నిజము. అలాగునే - మరొక కవి గారు -


"దేముడట - అహా మహా మహితాత్ముడట".
అతడే నట, యీ అవకతవక కకావికల
దుష్టపు ముదనష్టపు నికృష్టపు
లోకానికి స్రష్టయట!
మహాద్రష్టయట!!"

-అంటూ యాగీ చేయుటయు మమ్ము చాలా బాధ పెట్టినది. బలవంతులు మమ్ము వెండి బంగారులతోనూ, వజ్ర వైడూర్యములతోనూ మురిపించి, పాలు వెన్నలు తినిపించి, స్నానములు చేయించి తమ తమ ప్రయోజనములు చేకూర్చమని కోరుతున్న వేళ ఈ ఫల పుష్పములకు మేమెట్లు లొంగగలమని - ఆ కవి గార్లకును, ఆ యొక్క అనామకులకును మా ప్రశ్న!

## దేశములు - ధర్మములు అను షెడ్యూలు

మొదటి నుండియూ సూచిస్తూ వస్తున్నట్లుగా దేశములు అయిదు విధములు. కొన్ని విషయములు విస్తృతనీయములు.

మొదటి వర్ణపు దేశములకు యావత్ప్రపంచము మీదను, ఆకాశము మీదను, వ్యోమము పైనను, అఖిల ప్రాణి కోటి పైనను, సకల వస్తు సముదాయము పైనను సర్వ హక్కులున్నట్లు పలుమారులు చెప్పబడినది. అన్నియు వీరి కొరకై పుట్టి, నిలిచి, పెరిగి, చనిపోవుట న్యాయముగా నిర్ణయింపబడినది. ఎప్పటికప్పుడు బహుళ మానవ కోటికి అందుబాటుకాని క్రొత్త క్రొత్త పరికరములు, సాంఘిక ఆచారములు, మారణాస్త్రములు కనిపెట్టి, ఎంతటి ఖర్చునైనను మానవాళిచేత చెల్లింపజేసి, ఎల్లవేళలందును తమ జాతిని,



కలవారు - కడుపు గడవని వారు అను రెండు తెగలుగ విభజించి వుంచుటకు వీరికి పేటెంటు యివ్వబడినది. ఈ తరగతి దేశములో ఈ తరమున అమెరికా దేశము అగ్ర పీఠము ఆక్రమించుట మాకు సమ్మతము. అందుకే ఈ దేశము తనను తాను దేముడి నీడనుండు దేశముగా చెప్పుకొనును. వీరి పైననే మా కెక్కుడు అనుగ్రహము.

రెండవ వర్గపు దేశములకు యావత్ప్రపంచము పైనను అధికారము లేదు గాని, అట్టి అధికారమునకు వారు పై వర్ణపు వారితో ఒకసారి కలిసియు, మరోసారి విడిగాను ప్రయత్నము చేయుచుందురు. వీరు మార్క్సు అను ఒక మూర్ఖ మేధావి తయారు చేసిన సిద్ధాంతములను పురస్కరించుకుని, తమ దేశములలో కుంటుపడి ఆగిపోయిన పారిశ్రామిక విప్లవమును సాధించి, కమ్యూనిజమనే ముసుగు కప్పుకుని ఈనాటికీ మొదటి వర్గపు వారితో సమానమైన మారణాస్త్రములను చేయు సత్తా పెంచుకొనినారు. వీరి ఆలింగనము కూడా భల్లూకపు కౌగిలివంటిదే. యావత్ప్రపంచమును తమ పరిధిలోనికి తెచ్చుకొనుట వీరి ఆశయము - ధర్మము. అట్లు జరిగిన నాడు వారి యందు మా అనుగ్రహము పెరుగగలదు.

మూడవ వర్ణపు దేశములు పై రెండు వర్ణముల మధ్యా చీలిపోయినవి. వారు చెప్పు మంత్రములను పఠిస్తూ తమ సంఘములలో గల బక్క వారిని అణగద్రొక్కి పరిపాలన చేయుట ఈ దేశముల ధర్మము. పై రెండు వర్ణముల దేశములలోను చేయబడిన ఖరీదైన పరికరములను మారణాస్త్రము లనుకొని తమలోని బలవంతుల అవసరములు, సరదాలు తీర్చుట ఈ దేశముల బాధ్యత. ఒకటి, రెండు వర్ణముల వారి మారణాస్త్ర కార్ఖానాలు మూసుకుపోయి అచ్చట ఆర్థిక పరిస్థితులు దిగజారకుండా పరిరక్షించుట వీరి విధి. అందులకై వీరి యందు యిరుగు పొరుగు దేశములు యుద్ధము చేసికొనుట జరుగునని తెలియునది. ఇచ్చట నివసించు స్థిర చరాస్థ్యధికార బలముగల వారనిన మా కనుగ్రహము.

నిజమునకు నాల్గవ వర్ణమని, వర్ణ రహితమని చెప్పబడు నాలుగైదు తరగతుల దేశములు పై మూడు వర్ణముల యందుండుకొన్న అంతర్దేశములని గ్రహించెడిది. అనగా వీటికి వేరే ఎల్ల లుండవనియు, ప్రతి దేశమునందు అధిక, మిక్కిలి జనములు ఈ అంతర్దేశము లనబడు సమాజములలో పై వర్ణపు దేశములలోని ధన బలవంతుల జీవితములు సుగమము చేయు నిమిత్తమై మానవ మాత్రులుగాను, మానవాధములు గను సృష్టించబడిరని ఎరుగునది. ఈ అంతర్దేశీయుల ముఖ్య ధర్మము అవమానములు భరించుట - అత్యధిక దారిద్ర్యము మోయుట. మూడవ వర్ణపు అంతర్దేశములలో పుట్టి పెరిగి పాకీ పనులు చేయు నిమిత్తమును, చవకబారు కూలి పనులు చేయు నిమిత్తమును జీవించువారును, చుటజప్రక్కల గల ప్రథమ వర్ణపు దేశములకు దొంగతనముగా వలస వచ్చి, సందులలో పందుల వలె - మురికి కాలువలపై దోమల వలె జీవించెడి మనుషులనే వర్ణ రహిత దేశీయులుగా ఎరుగవలె. బ్రతికి యుండగనే చీము నెత్తుళ్ళ వైతరిణిలో పడి నికృష్టముగా జీవితము వెళ్ళమార్చుట ఈ అంతర్దేశీయుల ధర్మముగా తెలియవచ్చినది.

ఇప్పటికే ఈ నోటీసు చాలా నిడివి అయిపోయిన కారణమున యిక ముగించుటకు నిర్ణయము. కాని ముగించు ముందొకమాట అనవలయును. బలవంతుల సేవకే అంకితమయిన మాకు ప్రార్థనలు జరిపి మమ్ములను మొహమాటములో పెట్టుట మానివేసి దరిద్రులు, బలహీనులు,, బలవంతుల ఎదర నిలిచి - "మీ దేముడిని - మిమ్ము కూడా మేం తోసి రాజంటున్నాము. మీ యిష్టము వచ్చినట్లు చేసుకోండి. మీ అస్త్రములకు మేము భయపడము. చస్తూ బ్రతకడం కన్నా చచ్చి బ్రతకడం మేలు. కానివ్వండి. మీరు తయారు చేసిన అణు బాంబులు, ఉదజని బాంబులు పేల్చండి? లేదా సృష్టి ధర్మం అంటూ మీరు చెప్పుకొచ్చే హెచ్చు తగ్గులు తొలిగించి, మనుషులందరూ సమానమైన అహసజత్వమే నాగరికత అనండి. అలాంటి సంఘం సృష్టిద్దాం. లేదా అందరం కలిసి చావే పంచుకుందాం" అని బరితెగించి పోరాడదల్చుకుంటే ఆపడం ఈ దేముడి తరం కాదని యిందుమూలాన ప్రకటితం.

ఇక సెలవు?

ఇట్లు

దేముడు వ్రాలు

*



ఫోటో - కె. భాస్కర్ [హైదరాబాదు]